# మరణశాసనం రాస్తున్నదెవరు?

పిల్లి గుడ్డిదైతే ఎలుక ఇల్లంతా ఆడిందట. ఇప్పుడు కృష్ణా జలాల వినియోగం విషయంలో అదే జరిగింది. మొద్దునిద్రలో ఉన్న కాంగ్రెస్ సర్కారు తీరుతో ఏపీ ఈ ఏడాది నిరాటంకంగా కృష్ణా జలాలను కొల్లగొట్టింది. శ్రీశైలం ఎగువన పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ, దిగువన నాగార్జునసాగర్ కుడి కాలువ.. ఆ రెండు ఔట్‌లెట్ల నుంచే ఏపీ 450 టీఎంసీలకుపైగా మళ్లించింది. గత పదేండ్లలో ఎన్నడూ లేనివిధంగా, ఇప్పటికీ ఇంకా నీటి సంవత్సరం మూడు నెలలు మిగిలి ఉండగానే దాదాపు 75 శాతానికిపైగా కృష్ణా జలాలను తరలించుకుపోయింది. దీంతో సమృద్ధిగా వర్షాలు కురిసినా వేసవికి ముందే రిజర్వాయర్లు ఖాళీకాగా, నీటికి కటకటలాడాల్సిన దుస్థితి ఏర్పడింది. వెరసి ఏపీ పండుతుండగా, తెలంగాణ రైతాంగం ఎండుతున్నది.

**కృష్ణాలో 75% కొల్లగొట్టిన ఏపీ**

- ఎగువన, దిగువన నిరాటంకంగా కృష్ణా నదీజలాల తరలింపు
- పోతిరెడ్డిపాడు నుంచి 230 టీఎంసీలు..
- సాగర్ కుడికాలువ నుంచి 200 టీఎంసీలు.. ఎడమ కాలువ నుంచి మరో 25 టీఎంసీలు తరలింపు
- నాగార్జునసాగర్, శ్రీశైలం ఖాళీ
- మొద్దునిద్రలో రేవంత్ సర్కారు
- పండుతున్న ఏపీ.. ఎండుతున్న తెలంగాణ

- కృష్ణాలో ఈ ఏడాది వినియోగానికి అందుబాటులోకి వచ్చిన జలాలు 1023.95 టీఎంసీలు
- తాత్కాలిక కోటా (66:34 నిష్పత్తిలో ఏపీ వాటా 675.80 టీఎంసీలు
- ఏపీ వినియోగించుకున్న జలాలు 677.835 టీఎంసీలు
- తెలంగాణ వాటా 348.143 టీఎంసీలు
- తెలంగాణ వాడుకున్నవి 231.538 టీఎంసీలు




(నోట్: ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేనివిధంగా నీటి సంవత్సరం ఇంకా మూడు నెలలు ఉండగానే అత్యధిక స్థాయిలో కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోయింది)

గత నవంబర్ నుంచి శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో నీటి నిల్వలు

| రిజర్వాయర్ | పూర్తి నిల్వ | ప్రస్తుతం | ఫిబ్రవరి | జనవరి | డిసెంబర్ | నవంబర్ |
|---|---|---|---|---|---|---|
| శ్రీశైలం | 215.81 | 74.81 | 86.29 | 110.07 | 120.95 | 190.33 |
| నాగార్జునసాగర్ | 312.05 | 164.46 | 210.88 | 255.31 | 305.75 | 306.69 |

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల వినియోగంలో ఏపీని నిలువరించే క్రమంలో రేవంత్‌రెడ్డి సర్కారు ప్రదర్శించిన నిర్లక్ష్యం కారణంగా తెలంగాణ రైతాంగం సాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినా పంటలు చేతికందడమే ప్రశ్నార్థకంగా మారింది. తాగునీటికి తండ్లాడాల్సిన దుస్థితి దాపురించింది. సముద్రంలో కలిసిన 844 టీఎంసీలు పోనూ, ఈ ఏడాది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుల కింద వినియోగానికి 1023 టీఎంసీలకుపైగా అందుబాటులోకి వచ్చాయి. అందులో తాత్కాలిక కోటాలో భాగంగా ఏపీకి 675.80 టీఎంసీలు, తెలంగాణకు 348.143 టీఎంసీలు కేటాయించారు. ఇందులో తెలంగాణ ఇప్పటివరకు దాదాపు 231 టీఎంసీలను మాత్రమే వినియోగించుకోగా, ఏపీ మాత్రం కోటాకు మించి తరలించుకోపోయింది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఏపీ సర్కారు దాదాపు 75 శాతానికిపైగా కృష్ణా జలాలను కొల్లగొట్టుకునిపోయింది. వెరసి వేసవికి ముందే శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లు అడుగంటిపోయాయి.

### పోతిరెడ్డిపాడు ద్వారా 230 టీఎంసీలు

ఏపీ ఈ నీటి సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో ఒక్క పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారానే దాదాపు 230 టీఎంసీల కృష్ణా జలాలను కొల్లగొట్టింది. యాసంగి సీజన్ ప్రారంభం కాకుండానే శ్రీశైలం రిజర్వాయర్‌ను ఖాళీ చేయడం ప్రారంభించింది. గత నవంబర్ నాటికి శ్రీశైలంలో 190 టీఎంసీలు ఉండగా, ఆ తరువాత ఒక్క నెల వ్యవధిలోనే 60 టీఎంసీల జలాలను పోతిరెడ్డిపాడు నుంచి నిరంతరాయంగా తరలించింది. అంతేకాకుండా హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్, జీఎన్‌ఎస్‌ఎస్, ముచ్చుమర్రి, మల్యాల తదితర ఎత్తిపోతల ద్వారా మరో 10 టీఎంసీలకుపైగా కృష్ణా జలాలను తరలించింది.

### సాగర్ కుడికాలువ ద్వారా..

దిగువన నాగార్జున్‌సాగర్ వద్ద కుడి కాలువ, పవర్‌హౌజ్ ద్వారా కూడా కృష్ణా జలాలను ఏపీ తరలిస్తూనే ఉన్నది. కుడి కాలువ కింద ఏపీకి వాస్తవంగా 132 టీఎంసీల జలాల కేటాయింపు ఉండగా, ఇప్పటికే 185 టీఎంసీలను తరలించుకున్నది. అంటే కోటాకు మించి 53 టీఎంసీలను అధికంగా కొల్లగొట్టింది. కాలువ పూర్తిస్థాయి సామర్థ్యం 9,000 వేల క్యూసెక్కులు, పవర్‌హౌజ్ నుంచి అదనంగా 5,000 వేల క్యూసెక్కులు నికరకంగా రోజుకు 14,000 క్యూసెక్కుల (ఒక టీఎంసీన్నర) చొప్పున తీసుకెళ్లింది. నవంబర్ నెలాఖరు నుంచే సాగర్ కుడి కాలువ ద్వారా జలాల తరలింపు ప్రక్రియను ఏపీ ముమ్మరం చేసింది. దీంతోపాటు ఎడమ కాలువ పరిధి జోన్-3లో ఉన్న ఏపీ ఆయకట్టు కోసం 32 టీఎంసీలు కేటాయించగా, ఇప్పటికే 25 టీఎంసీలకుపైగా తరలించింది. మొత్తంగా సాగర్ నుంచి ఏపీ ఇప్పటికే 210 టీఎంసీలు వినియోగించుకోవడం గమనార్హం.

### శ్రీశైలం, సాగర్ ఖాళీ

జూన్ 1 నుంచి మే 31 వరకు నీటి సంవత్సరంగా పరిగణిస్తారు. 2024-25 నీటి సంవత్సరంలో ఇంకా మూడు నెలలు మిగిలి ఉన్నాయి. సాధారణంగా కృష్ణా బేసిన్‌లో వరద ప్రవాహాలు జూలై నెలాఖరు లేదా ఆగస్టులో ప్రారంభమవుతాయి. ఈ లెక్కన మరో ఐదు నెలల పాటు ప్రస్తుతం నిల్వ ఉన్న నీళ్లనే ఇరు రాష్ట్రాలు వినియోగించుకోవాల్సి ఉంటుంది. కానీ, రేవంత్‌రెడ్డి సర్కారు నిర్లక్ష్యత, ఏపీ సర్కారు దూకుడు కారణంగా వేసవికి ముందే రెండు రిజర్వాయర్లు అడుగంటిపోయాయి. శ్రీశైలంలో నీటి మట్టం ప్రస్తుతం 844 అడుగులకు చేరుకోగా 69 టీఎంసీలే నిల్వ ఉన్నాయి. రిజర్వాయర్ వాస్తవ డెడ్‌స్టోరేజీ 834 అడుగులు కాగా, ఈ సీజన్‌లో 820 అడుగులుగా నిర్ధారించారు. అక్కడ 40 టీఎంసీలే అందుబాటులో ఉంటాయి. ఈ లెక్కన శ్రీశైలంలో వినియోగానికి 29 టీఎంసీలే అందుబాటులో ఉన్నాయి. శ్రీశైలం రిజర్వాయర్‌పై ఆధారపడిన ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు మొత్తంగా ఏడు జిల్లాలకు సాగునీరు అందించాల్సి ఉన్నది. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం ప్రస్తుతం 521 అడుగులకు దిగజారింది. ప్రస్తుతం సాగర్‌లో 151 టీఎంసీలే నిల్వ ఉన్నాయి. సాగర్ డెడ్‌స్టోరేజీ 510 అడుగులు కాగా ఈ ఏడాది 515 అడుగులుగా నిర్ధారించారు. అక్కడ 140 టీఎంలు ఉంటాయి. ఈ లెక్కన సాగర్‌లో వినియోగానికి అందుబాటులో ఉండేది 11 టీఎంసీలే! సాగర్ ఆయకట్టు కింద తెలంగాణలో వేసిన పంటలు చేతికి రావాలంటే మరో నెలరోజులపాటు నీటిని విడుదల చేయాలి. హైదరాబాద్, నల్లగొండ తాగునీటి అవసరాలను తీర్చాల్సి ఉన్నది. రిజర్వాయర్ ఖాళీ అవడంతో నీటికి కటకట తప్పని దుస్థితి ఏర్పడింది.

### ఆది నుంచీ మొద్దునిద్రలో కాంగ్రెస్

తెలంగాణ అవసరాలకు కృష్ణా జలాలను సమర్థంగా వినియోగించుకోవడంలోనూ, ఇష్టారాజ్యంగా జలాలను తరలించుకుపోకుండా ఏపీని నిలువరించడంలోనూ కాంగ్రెస్ సర్కారు ఆది నుంచీ మొద్దునిద్ర పోతున్నది. ఏపీ నవంబర్ నుంచే రెండు రిజర్వాయర్లను ఖాళీ చేస్తున్న విషయాన్ని నీటిపారుదల శాఖ అధికారులు సర్కారు పెద్దల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. సాధారణంగా ప్రతి యాసంగి సీజన్ ప్రారంభంలోనే త్రిసభ్య కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, ఇరు రాష్ట్రాలకు నీటి వాటాలను తేల్చాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది సమావేశం జరగనే లేదు. త్రిసభ కమిటీ సమావేశం కోసం పట్టుబట్టలేదు. రిజర్వాయర్లన్నీ అడుగంటిన తరువాత, రైతులు ఆందోళనలకు దిగిన తరువాత మాత్రమే హడావుడి చేసింది. తెలంగాణ కోటా కింద ఇంకా 134 టీఎంసీలను వాడుకోవాల్సి ఉన్నదని, ప్రస్తుత నీటి అవసరాల కోసం 116 టీఎంసీలు కావాలని బోర్డు ముందు ఇండెంట్ పెట్టింది. కానీ, వారం రోజుల్లోనే 63 టీఎంసీలకు రాజీపడింది. దానికీ కట్టుబడకుండా మరింత రాజీపడి చివరకు 40 టీఎంసీలను వినియోగించుకునేందుకు అంగీకరించింది. దీంతో తెలంగాణ సాగర్ ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకం మారింది. కాంగ్రెస్ వైఫల్యం కారణంగా కుడికాలువ కింద ఈ యాసంగి సీజన్‌లో ఏపీలో సాగుచేస్తున్న 12 లక్షల ఎకరాలు పండుతుండగా, ఎడమ కాలువ కింద తెలంగాణ ఆయకట్టు ఎండుతున్నది. హైదరాబాద్‌కు తాగునీటి గండం పొంచి ఉన్నది. కాంగ్రెస్ వైఫల్యం కారణంగానే కరువు పరిస్థితులు నెలకొన్నాయి.

### తెలంగాణపైనే తిరిగి ఏపీ ఫిర్యాదు

నాగార్జునసాగర్ ఎడమ కాలువ జోన్-2, జోన్-3లోని ఏపీ ఆయకట్టుకు సంబంధించి సాగునీటిని విడుదల చేయాలంటూ గత డిసెంబర్ నుంచే కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కే ఆర్‌ఎంబీ)కు లేఖలు రాస్తున్నది. బోర్డు సైతం ఎలాంటి సమావేశాలను నిర్వహించకుండానే నీటి విడుదలకు ఉత్తర్వులు జారీ చేస్తూ వచ్చింది. ఏపీకి కేటాయించిన 32 టీఎంసీల కోటాలో డిసెంబర్ నాటికే 9.55 టీఎంసీలను వినియోగించుకోగా, ఆ తరువాత మరో 15.86 టీఎంసీలు వినియోగించుకున్నది. ఇటీవల నిర్వహించిన బోర్డు సమావేశంలో మరో 18 టీఎంసీలు కావాలని పట్టుబట్టింది. ఇదిలా ఉంటే, ఇప్పటికే ఏపీ తన కోటాకు సంబంధించి ఫిబ్రవరి నెలాఖరు నాటికే 25 టీఎంసీలను వినియోగించుకున్నది. మార్చి 1 నుంచి కూడా రోజుకు 3,530 క్యూసెక్కుల చొప్పున జలాలను ఏపీకి తరలిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ నీరు అందడం లేదంటూ ఏపీనే మళ్లీ తెలంగాణపై ఫిర్యాదులకు దిగడం గమనార్హం.

### తూములను మూసివేసి..

నాగార్జునసాగర్ ఎడమ కాలువ తూముల షట్టర్లను మూసివేసి దిగువన ఏపీ ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్న దుస్థితి నెలకొన్నది. ఇటీవల ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలోని తూటికుంట్ల మేజర్ కాలువ తూమును మూసివేసి, బోనకల్ బ్రాంచ్‌కెనాల్ నుంచి ఆంధ్రాకు నీటిని సరఫరా చేశారు. దీంతో బోనకల్లు, చింతకాని మండలాల్లోని తెలంగాణ ఆయకట్టు ఎండిపోతున్నది. జోన్-2లో బ్రాంచ్ కెనాల్స్ కింద తెలంగాణ, ఏపీ ప్రాంతాలకు చెందిన ఆయకట్టు కలిసి ఉంటుంది. అక్కడా ప్రస్తుతం ఇదే పరిస్థితి. జోన్-3లో మైలవరం నుంచి పూర్తిగా ఏపీ ఆయకట్టు ఉంటుంది. ఆ ప్రాంతానికి నీటిని తరలించేందుకు తెలంగాణ ప్రాంతానికి నీటిని సరఫరా చేసే కాలువల తూములను సీల్ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో పలువురు ఇరిగేషన్ శాఖ అధికారులు సైతం అందుకు ఊతమిస్తున్నారని రైతులు చెప్తున్నారు. ఫలితంగా ఎడమ కాలువ కింద, ఎగువ ఉన్న తెలంగాణ ఆయకట్టు ఎండిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### తెలంగాణకు తాళం.. ఏపీకి పారకం

ఇప్పటికే కోటాకు మించి జలాలను వినియోగించుకున్న ఏపీ.. ఎడమ కాలువకు మరిన్ని నీళ్లు కావాలంటూ బోర్డుకు లేఖ రాసింది. మరోవైపు, రేవంత్ సర్కారు పట్టింపులేనితనంతో సాగర్ ఎడమ కాలువ కింద ఉన్న తెలంగాణ ఆయకట్టు సైతం ఎండిపోతున్నది. నాగార్జునసాగర్ ఎడమ కాలువ పొడవు మొత్తం 180 కిలోమీటర్లు ఉంటుంది. దీనిని మూడు జోన్లుగా విభజించారు. జోన్-1, జోన్-2 కలిపి తెలంగాణలో 6.5 లక్షల ఎకరాలు ఆయకట్టు ఉన్నది. అదేవిధంగా జోన్-2, జోన్-3 పరిధిలో 3.62 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఎడమ కాలువ మొత్తానికి 132 టీఎంసీల కేటాయింపు ఉండగా, అందులో ఏపీ వాటా 32.25 టీఎంసీలు కాగా, మిగిలినది తెలంగాణ వాటా. నాగార్జునసాగర్‌లో నీటినిల్వలు పడిపోవడంతో ఎడమ కాలువకు పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు సాగునీటిని విడుదల చేయడం లేదు. దీంతో జోన్-1, జోన్-2లోని తెలంగాణ ఆయకట్టుకే నీరందని దుస్థితి నెలకొన్నది. ఏపీ ఇష్టారాజ్యంగా, కోటాకు మించి కృష్ణా జలాలను మళ్లిస్తున్నా చోద్యం చూసిన రేవంత్ సర్కారు, ఇప్పుడు కూడా ఎగువన ఎండబెడుతూ దిగువకు సజావుగా నీళ్లను వదిలిపెట్టడంపైనే దృష్టిపెట్టింది. జోన్-1, జోన్-2లో ఎడమ కాలువపై ఉన్న డిస్ట్రిబ్యూటరీలను మూసి వేసి మరీ దిగువ ఆయకట్టుకు నీటిని వదిలేస్తున్నది.

# ఇరిగేషన్.. పరేషాన్!

**గాడితప్పిన సాగునీటి పారుదల శాఖ**

**అన్నివిభాగాల్లో ఇన్‌చార్జులే బాధ్యులు**

- ఏడాదికాలంగా కీలక స్థానాలన్నీ ఖాళీ
- 13 సీఈ పోస్టులు ఖాళీ.. మరో 2 రెడీ
- 59 ఎస్ఈ, 35 ఈఈల ఉద్యోగ విరమణ
- భర్తీ ప్రతిపాదనలపై సర్కార్ మీనమేషాలు
- ప్రభుత్వ తీరుపై అధికారుల గుర్రు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): కీలక స్థానాల్లో ఉన్న ఒక్కో ఇంజినీరుకు రెండు, అంతకు మించి బాధ్యతలు.. కిందిస్థాయి ఇంజినీర్లు, సిబ్బందికి శక్తికి మించి పర్యవేక్షణ విధులు. ఉన్న అధికారులు, సిబ్బంది విరమణ పొందుతుంటే వారి స్థానాల్లో మరొకరికి అదనపు బాధ్యతలు.. ఇది ఒకటి, రెండు నెలలుగా కాదు.. ఏకంగా ఏడాదికి పైగా ఇదే తంతు. మొత్తంగా కాంగ్రెస్ సర్కారు తాత్సారంతో ఒక్క ఏడాదిలోనే సాగునీటి పారుదలశాఖ అస్తవ్యస్తమైంది. ఒకరి వెంట ఒకరు సీనియర్ ఇంజినీర్లు విరమణ పొందుతుండగా, ఆ స్థానాలను భర్తీ చేయకుండా ఇతర సీఈలకు, లేదంటే ఎస్ఈలకు అదనపు బాధ్యతలను సర్కారు అప్పగిస్తూ వస్తున్నది. వివిధ విభాగాల్లో పూర్తిస్థాయి అధికారులను నియమించకుండా ఇన్‌చార్జులతోనే నెట్టుకొస్తున్నది. వెరసి ఈ శాఖ పరిపాలన పూర్తిగా గాడితప్పింది. ప్రాజెక్టుల పనుల సంగతేమో కానీ, తుదకు సాగునీటి సరఫరాను సైతం ఈ ఏడాది పర్యవేక్షించలేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతున్న దుస్థితి నెలకొన్నది. చేతికొచ్చిన పంటలను కాపాడే నాథుడే లేక అన్నదాతలు ఎక్కడికక్కడ గగ్గోలు పెడుతున్నారు.

### సగం మంది సీఈలు ఖాళీ

ఇరిగేషన్ శాఖలో ఇప్పటికే జనరల్, ఓఅండ్‌ఎంలో 2 ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 22 సీఈ పోస్టులు ఉండగా, 13 మంది సీఈలు ఉద్యోగ విరమణ పొందారు. ఈ నెలలో మరో ఇద్దరు సీఈలు విరమణ పొందనున్నారు. 59 మందికి పైగా ఎస్ఈలు, అనేక సర్కిళ్లలో ఈఈ పోస్టులు ఖాళీ అయ్యాయి. ప్రమోషన్లను కల్పించి ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ సర్కారు ఏడాదిగా మీనమేషాలను లెక్కిస్తున్నది. ఈఎన్సీ, సీఈ స్థాయి నుంచి దిగువన ఏఈఈ వరకు 2,796 శాంక్షన్ పోస్టులు ఉండగా, ప్రస్తుతం 2,436 మంది ఉన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్, సూపరింటెండెంట్, రికార్డ్ అసిస్టెంట్ తదితర విభాగాల్లో 2,538 శాంక్షన్ పోస్టులు ఉండగా, ప్రస్తుతం 1,953 మంది ఉన్నారు. రెండింటిలో కలిపి మొత్తంగా 5,334 శాంక్షన్ పోస్టులు ఉండగా ప్రస్తుతం 4,389 మందే ఉన్నారు. అందులో ఇంజినీరింగ్ విభాగంలో 360, ఇతర విభాగాల్లో 586 పోస్టులు మొత్తంగా 945 ఖాళీలు ఉన్నాయి. గడచిన ఏడాది కాలంలో మరో 231కి పైగా ఖాళీలు ఏర్పడ్డాయి.

### ప్రమోషన్లపై ఎటూ తేల్చని సర్కారు

ఇరిగేషన్ శాఖలో ప్రమోషన్లు కల్పించాలని 7 నెలల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు ప్రమోషన్ల సినియారిటీ జాబితాను సిద్ధంచేసి ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటివరకూ ప్రభుత్వం మాత్రం ఎటూతేల్చలేదు. ఆ తర్వాత దీనిపై ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది. గత జనవరి నెలాఖరు కల్లా ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ మొత్తాన్ని పూర్తిచేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. ఇది జరిగి రెండు నెలలు గడచినా అతీగతి లేకుండాపోయింది. ఇటీవలే డీపీసీ (డిపార్ట్‌మెంట్ ప్రమోషనల్ కమిటీ) సైతం ఈఎన్సీ పోస్టుకు సంబంధించి 9 మందికి ఆమోదం తెలిపింది. శ్రీనివాస్, కేఎస్ఎస్ చంద్రశేఖర్, పీపీపీ ప్రసాద్, చక్రధర్, అమ్జద్ హుస్సేన్, బీ శంకర్, శంకర్‌నాయక్, మోహన్‌కుమార్, సుధాకర్‌రెడ్డి పేర్లను కమిటీ ప్రతిపాదించింది. ఆ ఫైలు ప్రభుత్వానికి చేరినా, ముందుకు కదలడం లేదు. ఆ జాబితాలో ఉన్నవారిలో ఇప్పటికే ఇద్దరు విమరణ పొందగా, ఈ నెలాఖరున మరో ఇద్దరు కూడా విరమణ పొందనున్నారు. అన్ని స్థాయిల్లో ఉన్న ఒక్కో ఇంజినీర్లు రెండు, అంతకు మించి బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఫలితంగా సాగునీటి పారుదలశాఖ పాలన గాడి తప్పుతున్నదని సీనియర్ ఇంజినీర్లు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రమోషన్లు కల్పించి, పూర్తిస్థాయి అధికారులను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు విరమణ పొందిన ఉద్యోగులను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగించవద్దని హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

**అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న కొందరు ఇంజినీర్లు**

| అధికారి | నిర్వర్తిస్తున్న బాధ్యతలు |
|---|---|
| ఈఎన్సీ అనిల్‌కుమార్ | అడ్మినిస్ట్రేషన్, జనరల్ |
| ఏ శ్రీనివాస్‌రెడ్డి | కొత్తగూడెం ఎస్ఈ, సీఈ, ములుగు సీఈ |
| విజయభాస్కర్‌రెడ్డి | నాగర్‌కర్నూల్ సర్కిల్-1 ఎస్ఈ, సీఈ, ఓఅండ్‌ఎం ఈఎన్సీ |
| కే సుధాకర్‌రెడ్డి | జగిత్యాల సీఈ, రామగుండం ఈఎన్సీ |
| రమేశ్‌బాబు | సూర్యాపేట సీఈ, ఖమ్మం సీఈ |
| ఏఎస్ఎన్ రెడ్డి | నాగర్‌కర్నూల్ సర్కిల్-2 ఎస్ఈ, సీఈ |
| మోహన్‌కుమార్ | సీడీవో సీఈ, ఇంటర్‌స్టేట్ సీఈ |
| అజయ్‌కుమార్ | నల్లగొండ ఎస్ఈ, సీఈ |
| ధర్మ | సంగారెడ్డి సీఈ, హైదరాబాద్ సీఈ |
| గోలి అశోక్ | జగిత్యాల ఎస్ఈ, వరంగల్ సీఈ |
| భద్రీనారాయణ | నిజామాబాద్ ఎస్ఈ, సీఈ |

(నోట్: ఇవిగాక పదుల సంఖ్యలో ఇంజినీర్లు ఎస్ఈలుగా, ఈఈలుగా అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు)

# సూర్యాపేటలో పారింది కాళేశ్వరం జలాలే

ఎస్సారెస్పీ నీళ్లు వస్తే ఇప్పుడు వరి ఎందుకు ఎండుతుంది?

కాళేశ్వరం నీళ్లు కాదంటూ అసెంబ్లీ సాక్షిగా సీఎం అబద్ధాలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుపై రైతుల ఆగ్రహం

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో ఎండిన వరి చేను

సూర్యాపేట, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : 'సూర్యాపేటకు కాళేశ్వరం నుంచి చుక్క నీళ్లు రాలేదు.. గత ఏడేండ్లపాటు వచ్చినవి శ్రీరాంసాగర్ నీళ్లే' అంటూ అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల పట్ల జిల్లా రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. '2018కి ముందు దశాబ్దాల తరబడి నీళ్లు రాలేదు.. కాళేశ్వరం పూర్తయిన తరువాత 2018 నుంచి 2023 వరకు వద్దనేంత వరకు నీళ్లొచ్చాయి. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నీళ్లు బంద్ అయ్యాయంటే సూర్యాపేటకు ఏ నీళ్లు వచ్చాయో అర్థమవుద్ది. అయ్యా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మీరు సూర్యాపేట జిల్లాలో పర్యటిస్తే వచ్చిన నీళ్లు ఏవో లెక్కలతోసహా చెబుతాం. అప్పుడు సక్కగా అర్థం అవుద్ది' అంటూ రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలో 2.66 లక్షల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టు ఉంటే.. 2018కి ముందు 50 వేల ఎకరాలకు మించి వరి పండలేదని వ్యవసాయ శాఖ లెక్కలు తీస్తే అర్థమవుతుందని రేవంత్‌ను ఉద్దేశించి రైతులు, బీఆర్ఎస్ నాయకులు చెప్తున్నారు. 2018 తరువాత నుంచి 2023 వరకు వందశాతం వరి పండిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత చిన్న సాకు చూపించి కాళేశ్వరాన్ని పండబెడితే యాసంగి పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిజంగా కాళేశ్వరం జలాలు కాకుంటే మరి ఆ పంటలు ఎందుకు ఎండుతున్నాయో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్తారా? లేక ప్రభుత్వం తరపున ఎవరైనా వచ్చి చెప్తారా? అని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో ఎస్సారెస్పీ జలాలు సరిగ్గా రాక 30 వేల ఎకరాల్లో వరి నాట్లు వేయలేదని, గత నెలన్నర రోజుల్లో దాదాపు 65 వేలకుపైనే ఎకరాల్లో వరి ఎండిపోగా పంట చేతికి వచ్చే నాటికి లక్షన్నర ఎకరాలకు చేరుకుంటుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు వేస్తున్నట్టు వారు చెప్తున్నారు. నిజంగా కాళేశ్వరం జలాలు సూర్యాపేటకు రాకపోతే పంటలు ఎందుకు ఎండిపోతున్నాయని, రైతుల పట్ల నిజంగా ప్రేమ ఉంటే శ్రీరాంసాగర్ నుంచి నీళ్లు ఇచ్చి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. ముమ్మాటికీ సూర్యాపేటకు వచ్చింది కాళేశ్వరం జలాలేనని, ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి అబద్ధాలు మానుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

> **పారింది శ్రీరాంసాగర్ నీళ్లే..**
>
> 'సూర్యాపేట జిల్లాకు కాళేశ్వరం నుంచి చుక్క నీళ్లు రాలేదు. గత ఏడేండ్లపాటు వచ్చినవి శ్రీరాంసాగర్ నీళ్లే.. ఆ నీటితోనే పంటలు సాగయ్యాయి.
>
> - అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన

### రేవంత్‌కు దమ్ముంటే ఇక్కడి పొలాల్లో పర్యటించాలి

**సూర్యాపేటకు** కాళేశ్వరం జలాలు రాలేదని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు వల్లించారు. గతంలో జిల్లాకు చెందిన మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌తోపాటు అనేక మంది కాంగ్రెస్ నాయకులు కూడా అన్నారు. రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటిస్తే పంటలు ఎండిపోతున్న రైతులు ఆయన్ను ఉరికిచ్చి కొడుతారు. ఏడేండ్లు ఎండిపోని పొలాలు నేడు ఎందుకు ఎండుతున్నాయో అసెంబ్లీలో చెప్పాలి. జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల్లో వరి ఎండిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై శాపనార్థాలు పెడుతున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 2018కి ముందు యాసంగి సీజన్లలో 17 వేల ఎకరాలకు మించి వరి పండించలేదు. 2018 తరువాత 1.27 లక్షల ఎకరాల్లో వరి పండుతుందంటే అవి ఏ నీళ్లో బుద్ధి ఉన్న ఎవరికైనా అర్థం అవుతుంది. కాళేశ్వరం జలాలు కాదని నిరూపించేందుకు వరి ఎండకుండా వెంటనే నీటిని విడుదల చేయాలి.

–గాదరి కిశోర్‌కుమార్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే

### ఏ నీళ్లో.. ఇప్పుడూ ఇవ్వండి

**సీఎం** రేవంత్‌రెడ్డి సార్.. గతంలో ఎస్సారెస్పీ కాలువలో శ్రీరాంసాగర్ నీళ్లు వచ్చాయని చెప్పారు కదా.. ఆ నీళ్లనే ఇప్పుడు ఇవ్వండి. ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీళ్లు రాక వరి పంట నోటికాడికి వచ్చి ఎండిపోయింది. అప్పుడు వచ్చిన నీళ్లు ఇప్పుడు ఎందుకు ఇవ్వలేకపోతున్నారు. పంట ఎండిపోవడంతో తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలుస్తలేదు.

- హలావత్ బిక్యా, రైతు, మోతె మండలం

# త్యాగాల చరిత్ర మాది ద్రోహాల చరిత్ర ఉత్తమ్‌ది

- కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం చేసిందే కాంగ్రెస్
- పోతిరెడ్డిపాడుకు వ్యతిరేకంగా పోరాటం చేసింది బీఆర్ఎస్
- కృష్ణాజలాల్లో అన్యాయం జరిగిందనే నాడు రాజీనామాలు
- పదవుల కోసం ఉత్తమ్, కాంగ్రెస్ నేతలు పెదవి విప్పలేదు
- మాజీ మంత్రి హరీశ్ మండిపాటు